సాక్షి

పార్వతీపురం మన్యం

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



'మందు'జాగత్త చర్యలు

మెడికల్ షాపులపై ఔషధ నియంత్రణ అధికారులు పర్యవేక్షణ పెంచారు. జిల్లాలో ఉన్న మందుల దుకాణాలను నిరంతరం పరిశీలిస్తున్నారు.

- 8లో



అండర్-19 ఖోఖో పోటీలకు జిల్లా జట్లు సిద్ధం

అంతర్ జిల్లాల అండర్-19 స్కూల్‌గేమ్స్ బాల, బాలికల ఖోఖో పోటీలకు జిల్లా జట్లు సిద్ధమయ్యాయి.

- 8లో

ముఖ్యమంత్రిని కలిసిన ఎంపీ



చీపురుపల్లి: గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సుకు ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిను విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

న్యూస్‌రీల్

సైకిల్‌పై 11 జ్యోతిర్లింగాల యాత్ర



ఐటీడీఏ సిబ్బందితో జ్యోతిర్లింగాల యాత్రికుడు

సీతంపేట: సైకిల్‌పై 11 జ్యోతిర్లింగాల యాత్ర చేస్తున్నట్టు బీహార్‌కు చెందిన అరుణ్‌కుమార్ తెలిపారు. సీతంపేట ఐటీడీఏకు మంగళవారం చేరుకున్నారు. 2001లో ఇక్కడ పనిచేసిన ప్రాజెక్టు అధికారి సంజయ్‌కుమార్‌తో పాటు సిబ్బందితో ఉన్న పరిచయంతో అందరినీ కలిసినట్టు తెలిపారు. అనంతరం తన యాత్రను ప్రారంభించారు. బీహార్ నుంచి 2022 నవంబర్ 8న ప్రారంభించిన యాత్ర గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఆంధ్రా, తెలంగాణా, ఒడిశా మీదుగా కొనసాగుతుందన్నారు. మే నెలలో కేదారినాథ్, బద్రీనాథ్‌కు చేరుకోవడంతో యాత్ర ముగుస్తుందని తెలిపారు.

తానా 'ఈ-పుస్తకం'లో పరిశినాయుడు కార్టూన్లు



ఈ-పుస్తకంలో ప్రచురితమైన కార్టూన్

గరుగుబిల్లి: తెలుగు భాష, సంస్కృతిపై ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్టూన్ల పోటీలు-2023 నిర్వహించింది. పోటీకి వచ్చిన కార్టూన్లలో అత్యుత్తమంగా ఉన్న కొన్ని కార్టూన్లను తానా ఈ-పుస్తకంలో ముద్రించింది. ఇందులో గరుగుబిల్లి మండలం నాగూరు గ్రామానికి చెందిన నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు గీసిన వ్యంగ్య చిత్రాలకు చోటు లభించింది. ప్రపంచ వ్యాప్తంగా 740 కార్టూన్లు పంపించగా అందులో 140 మాత్రమే ఎంపికయ్యాయని, ఇందులో తను పంపించిన రెండు కార్టూన్లు ప్రచురితం చేయడం ఆనందంగా ఉందని పరిశినాయుడు తెలిపారు.

కంపెనీలో రియాక్టర్ పేలి ఉద్యోగి మృతి



చొంగల రాము(ఫైల్)

సీతానగరం: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో గల జీఎంఎఫ్‌ఆర్ ఫార్మా కంపెనీలో జరిగిన రియాక్టర్ బ్లాస్టింగ్ ప్రమాదంలో సీతానగరం మండలంలోని గెడ్డలుప్పి గ్రామానికి చెందిన చొంగల రాము(27) మంగళవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చొంగల గోవింద, సావిత్రమ్మల కుమారుడు రాము అచ్యుతాపురంలో ఉన్న జీఎంఎఫ్‌ఆర్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. అక్కడ రియాక్టర్ బ్లాస్టింగ్ సంభవించి ఏర్పడిన మంటల్లో ఒకరు మృతి చెందగా పలురికి గాయాలైన విషయం తెలుసుకుని కంపెనీకి ఫోన్ చేయగా గెడ్డలుప్పి గ్రామానికి చెందిన రాము మృతి చెందినట్లు గ్రామస్తులకు సమాచారం వచ్చింది. రాము 6 నెలల కిందటే జీఎంఆర్ ఫార్మా కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. రాము మృతి చెందిన విషయం తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎస్పీ దంపతులకు శుభాకాంక్షలు



ఎస్పీ దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

పార్వతీపురంటౌన్: విశాఖపట్టణంలో గతనెల 26న వివాహం చేసుకున్న పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు, సంపత్‌భవ్య దంపతులకు డిప్యూటీ సీఎం పి.రాజన్నదొర, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. వారంతా ఎస్పీ బంగ్లాకు మంగళవారం వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ సవరపు జయమని, రాష్ట్ర దాసరి కమిషన్ చైర్మన్ రంగుముద్రి రమాదేవి, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ, పార్వతీపురం డీఎస్పీ సుభాష్, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



తల్లీ.. కరుణించు..

పోలమాంబ.. పాహిమాం..! అంటూ భక్తుల జయజయ ధ్వానాలు.. సాంస్కృతిక ప్రదర్శనల నడుమ మారుజాతర వైభవంగా సాగింది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు.

పోలమాంబ.. పాహిమాం..!



గోముఖినది బ్రిడ్జిపై బారులుతీరిన భక్తులు (ఇన్‌సెట్లో) పోలమాంబ

- తొలిజాతరను మరిపించిన మారుజాతర
- అమ్మవారిని దర్శించుకున్న లక్షలాది మంది భక్తులు
- క్యూకాంప్లెక్స్‌లు నిండిపోవడంతో ఎండలోనే నిరీక్షణ
- సిరిమానుకు ప్రత్యేక పూజలు



సిరిమానుకు పూజలు చేస్తున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల కుల దైవం, భక్తుల కొంగుబంగారమైన శంబర పోలమాంబ అమ్మవారి మారుజాతర మంగళవారం కనులపండువగా సాగింది. తొలిజాతరను తలపించేలా మారు జాతరకు భక్తులు పోటెత్తారు. ఉదయం 5 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి క్యూకట్టారు. లక్షాలాది మంది భక్తుల రాకతో శంబర గ్రామం కిక్కిరిసిపోయింది. జైపోలమాంబ జయజయ ధ్వానాలు మారుమోగాయి. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ భక్తులు సుమారు లక్షా50 వేల మంది రాకతో ఉదయం 11 గంటల తర్వాత రద్దీ పెరిగింది. ప్రధానాలయం వెనుకన ఏర్పాటుచేసిన క్యూకాంప్లెక్స్‌లు మొత్తం భక్తులతో నిండిపోయాయి. అమ్మవారి దర్శనం కోసం గంటల తరబడి ఎండలోనే గోముఖి నది బ్రిడ్జ్ వరకు క్యూలో వేచిఉన్నారు. చదురుగుడిలోని అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఇబ్బందిపడకుండా సాలూరు సీఐ ధనుంజయరావు, ఎస్‌ఐ జి.ఫైడిరాజు, ఇతర సర్కిల్స్, స్టేషన్లకు చెందిన సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించారు. రాకపోకలను క్రమబద్ధీకరించారు. ప్రధానాలయంలో అమ్మవారిని భక్తులు దర్శించుకునేలా ఆల య ఈఓ వి.రాధాకృష్ణ దగ్గరుండి చర్యలు చేపట్టారు. ప్రధానాలయం వెనుకన ఏర్పాటుచేసిన ఉచిత, రూ.10, రూ.50 దర్శన టిక్కెట్ల లైన్ల గూండా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వనంగుడిలో ఉన్న పోలమాంబ అమ్మవారిని భక్తులు దర్శించుకొని, ఆలయం వెనకన ఉన్న వేపచెట్టుకు పూజలు చేశారు. ఘటాలు సమర్పించారు. పూజా కార్యక్రమాలను ట్రస్ట్‌బోర్డు సభ్యులతో పాటు చైర్మన్ పూడి దాలినాయుడు పర్యవేక్షించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు లడ్డూప్రసాదం, పులిహోర ప్యాకెట్లను అందజేశారు. మారుజాతర సాఫీగా సాగేందుకు 160 మంది పోలీసులు విధులు నిర్వహించారు. పలువురు తాగునీరు సరఫరా చేశారు.

సిరిమానుకు పూజలు

శంబర గ్రామంలోని ప్రధాన రహదారి వద్దనున్న సిరిమాను కర్రకు భక్తులు అధిక సంఖ్యలో పసుపు, కుంకమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీ కారణంగా ఆలయంలోకి వెళ్లలేక చదురుగుడి ముందున అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. చదురుగుడి వెనుకన ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. రాజాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవి, ముఖగాత్ర విద్వాంసురాలు అమ్మాజమ్మలు అమ్మవారి స్తోత్రాలను వినిపించారు.



అమ్మవారికి సమర్పించేందుకు ఘటాన్ని తీసుకెళ్తున్న మహిళ

పనులు పూర్తిచేయాల్సిందే..

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఇది పనుల సీజన్.. జిల్లాలో తలపెట్టిన అభివృద్ధి పనులన్నీ పూర్తిచేయాల్సిందేనని కలెక్టర్ నిషాంత్‌కుమార్ స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ పీఐయూ విభాగం కింద జరుగుతున్న పనులపై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన పీఎంజీఎస్‌వై, ఆర్‌సీపీఎల్ డబ్ల్యూఈ, ఏపీఆర్‌ఆర్‌పీ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల సీజన్‌ను వృథాచేయరాదన్నారు. అటవీ ప్రాంతంలో నిర్మించే రహదారులపై అటవీ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం జరగకుండా వెంటవెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో 28 పీఎంజీఎస్‌వై రహదారి పనుల్లో ఇప్పటి వరకు 13 పనులు పూర్తి చేశామని చెప్పారు. ఆర్‌సీపీఎల్ డబ్ల్యూఈ కింద 35 రహదారి పనులు ఉండగా 17 పనులు పూర్తి చేశామన్నారు. 6 బ్రిడ్జి పనుల్లో ఒకటి పూర్తయిందన్నారు. సమావేశంలో పాలకొండ కార్య నిర్వాహక ఇంజినీర్ రాధారాణి, డీఈలు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

పథక లక్ష్యాల సాధనపై సమీక్ష

ఉద్యానవన, పశుసంవర్థక, మత్స్యశాఖ, బిందు సేద్యం లక్ష్యాల సాధనపై వ్యవసాయ అనుబంధ శాఖల మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సమీక్షించారు. రబీలో ఈ పంట నమోదు, పీఎం కిసాన్ ఈకేవైసీ నమోదుపై ఆరా తీశారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్‌ను ఆదేశించారు. సమావేశంలో జిల్లా మత్స్య అధికారి వి.తిరుపతయ్య, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ ఎ.ఈశ్వరరావు, జిల్లా సూక్ష్మ నీటిపారుదల శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సాక్షి ప్రీమియర్ లీగ్



- జేఎన్‌టీయూ- గురజాడ మైదానంలో పోటీల నిర్వహణ
- పోటీలను ప్రారంభించనున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌కు సర్వం సిద్ధమైంది. విజయనగరం జిల్లా కేంద్రం శివారు జేఎన్‌టీయూ-గురజాడ వర్సిటీ మైదానం వేదికగా బుధవారం నుంచి సీనియర్స్, జూనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నాయి. డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, మెడికల్ కోర్సులు చదువుతున్న వారు సీనియర్ విభాగంలో, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులు జూనియర్ విభాగంలో ఆయా కళాశాలల జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ-జీవీ అధికారులు, ప్రొఫెసర్లు, జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు హాజరుకానున్నారు.

సీనియర్స్ విభాగం....

1వ తేదీన: లెండి ఇంజినీరింగ్ కళాశాల-సత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల
గాయిత్రీ డిగ్రీ కళాశాల-అవంతి ఇంజినీరింగ్ కళాశాల ఎ-జట్టు
2న: కోస్టల్ ఇంజినీరింగ్ కళాశాల-అవంతి ఇంజినీరింగ్ కళాశాల (కొత్తవలస)
అవంతి ఇంజినీరింగ్ కళాశాల-బి జట్టు-సత్య ఇంజినీరింగ్ కాలేజ్
జేఎన్‌టీయూ-జీవీ కళాశాల - జీసీఎస్‌ఆర్ కాలేజ్ (రాజాం)
3న: అవంతి రీసెర్చ్ టెక్నో కళాశాల- గోకుల్ ఇనిస్టిట్యూట్ కాలేజ్ (బొబ్బిలి)
అవంతి ఫార్మసీ కళాశాల-మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాల (భోగాపురం)
4న: మ్యాచ్-2 విన్నర్ - ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల
మ్యాచ్-1 విన్నర్ - మ్యాచ్-4 విన్నర్
మ్యాచ్-3 విన్నర్ - మ్యాచ్- 5 విన్నర్
మ్యాచ్- 6 విన్నర్ - మ్యాచ్-7 విన్నర్
5న: మ్యాచ్-8 విన్నర్ - మ్యాచ్-10 విన్నర్ (తొలి సెమీఫైనల్)
మ్యాచ్-9 విన్నర్ - మ్యాచ్-11 విన్నర్ (రెండో సెమీఫైనల్)
6వ తేదీన: మ్యాచ్-12 విన్నర్ - మ్యాచ్-13 విన్నర్ (ఫైనల్స్)

జూనియర్ విభాగం ....

2వ తేదీన: వేదాంత జూనియర్ కాలేజ్- ఆర్‌కే జూనియర్ కళాశాల
3న: భాస్కర్ జూనియర్ కళాశాల - భరత్ జూనియర్ కళాశాల
మ్యాచ్- 1 విన్నర్ - శ్రీనివాస జూనియర్ కళాశాల
5న: మ్యాచ్-2 విన్నర్ - పీఎస్‌ఎం వాసవి జూనియర్ కళాశాల
6వ తేదీన: మ్యాచ్-3 విన్నర్ - మ్యాచ్-4 విన్నర్ (ఫైనల్స్)

గోవిందుని కల్యాణోత్సవానికి వేళాయె..



స్వామివారి కల్యాణం కోసం ఏర్పాటు చేసిన టెంట్లు

- నేడు స్వామివారి కల్యాణం



తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామివారి వార్షిక కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మాఘశుద్ధ ఏకాదశి సందర్భంగా బుధవారం సాయంత్రం 5 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. తాటికమ్మలతో చలువ పందిరి వేశారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కల్యాణ మంటపాన్ని పచ్చని తోరణాలతో ముస్తాబుచేస్తున్నారు. వీరఘట్టాంకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్. శర్మయాజీ పర్యవేక్షణలో స్వామివారి కల్యాణం జరుగుతుందని ఆలయ ఈఓ వి.ఎల్.నగేష్ తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులకు అందజేసేందుకు లడ్డూ ప్రసాదం సిద్ధం చేస్తున్నామన్నారు. ఫిబ్రవరి 5న ఉదయం 8 గంటలకు పవిత్ర నాగావళినదిలో స్వామివారికి శ్రీచూర్ణోత్సవం, శ్రీచక్రతీర్థ స్నానం నిర్వహిస్తామని చెప్పారు. స్వామివారి కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు తరలిరావాలని కోరారు.


మూలగూడలో ఏనుగుల గుంపు

భామిని: భామిని మండల కేంద్రానికి సమీపంలోని మూలగూడ-ఏటంగూడ వద్ద మంగళవారం ఏనుగులు సంచరించాయి. బొప్పాయి, చెరకు తోటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పాలకొండ ఫారెస్ట్ రేంజర్ కె.తవిటినాయుడు, ఎఫ్‌బీఓ లక్ష్మణమూర్తి ఏనుగుల జాడను పరిశీలిస్తూ రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా

సంక్షేమ పాలన

- డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలన చరిత్రలో నిలిచిపోతుందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో మంగళవారం మాట్లాడారు. రాష్ట్రంలో విజయవంతంగా సాగుతున్న సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటుచేసేందుకు పలు రాష్ట్రాలు ఆసక్తిచూపుతున్నాయన్నారు. అర్హతే ప్రామాణికంగా, పార్టీలకతీతంగా, అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమచేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు, అర్హులందరికీ పథకాలు అందించేందుకు ప్రతిష్టాత్మకంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రజలతో మమేకమై వారికి మరింత సేవలు అందించే క్రమంలో పార్టీ తరఫున సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను నియమించినట్టు వెల్లడించారు. వీరికి ఈనెల 2న మెంటాడ, 3న సాలూరు, 4న మక్కువ, 5న పాచిపెంట మండలాల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు.

క్లుప్తంగా

పారా వాలీబాల్ ఆంధ్రా జట్టు కెప్టెన్‌కు అభినందనలు



శ్రీనివాసరావును అభినందిస్తున్న ఎంపీపీ,ఎంపీడీఓలు

కొత్తవలస: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పారా వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన పాటిపిరెడ్డి శ్రీనివాస రావును ఎంపీడీఓ వై.పద్మజ, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మలు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అభినందించారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి జరగనున్న జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. శ్రీనివాసరావు ప్రస్తుతం కొత్తవలస మండలం తుమ్మికాపల్లి సచివాలయంలో డిజిటల్ సహాయకుడిగా పనిచేస్తున్నారు. ఈ మేరకు ఆయన సహచర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

హత్యకేసులో ముద్దాయికి జీవితఖైదు

విజయనగరం లీగల్ / ఎల్‌కోట: ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నేరం రుజువు కావడంతో ఎల్.కోట మండలం పోతంపేట గ్రామానికి చెందిన కోరుకొండ అప్పలపాత్రుడికి జీవిత ఖైదుతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణ చక్రవర్తి మంగళవారం తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.రఘు రాం తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. ముద్దాయికి చెందిన లారీలో అదే గ్రామానికి చెందిన చంద్రపు గౌరినాయుడు క్లీనర్‌గా పనిచేసేవాడు. పాత్రుడు లారీలో గంజాయి రవాణా చేస్తున్నాడని తెలుసుకున్న క్లీనర్ గౌరి నాయుడు భయంతో ఉద్యోగం మానేశాడు. ఇదిలా ఉండగా 2015 జూలై 16న అప్పల పాత్రుడు తన లారీలో గంజాయి రవాణా చేస్తుండగా చోడవరం పోలీసులకు పట్టుబడ్డాడు. ఏడు నెలల అనంతరం బెయిల్‌పై విడుదలయ్యాడు. క్లీనర్ గౌరినాయుడు తనపై పోలీసులకు సమాచారం ఇచ్చాడని అనుమానం పెంచుకుని కక్షబూనాడు. ఈ నేపథ్యంలో 2016 నవంబర్ 26 గ్రామదేవత పండగ జరుగుతుండగా అప్పలపాత్రుడు తన కళ్లం సమీపంలోకి గౌరినాయుడు వస్తుండడం గమనించి వెదురు దుడ్డుకర్రతో తలపై విచక్షణా రహితంగా కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన గౌరినాయుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హతుని తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎల్.కోట ఎస్సై ఎం.శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. సీఐ సంజీవరావు నిందితుడు అప్పల పాత్రుడుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాధారాలతో కేసు రుజువు చేయడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

‘మందు’జాగత్త చర్యలు

- మెడికల్ షాపులపై అధికారుల పర్యవేక్షణ
- ఏడాదిలో 863 దుకాణాల పరిశీలన
- 135 శాంపిల్స్ సేకరణ
- 6 కేసులు నమోదు



మందుల షాపు

విజయనగరం ఫోర్ట్: మెడికల్ షాపులపై ఔషధ నియంత్రణ అధికారులు పర్యవేక్షణ పెంచారు. జిల్లాలో ఉన్న మందుల దుకాణాలను నిరంతరం పరిశీలిస్తున్నారు. నిబంధనలు పాటిస్తున్నదీ..లేనిదీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ పాటించని వారిపై చర్యలు తీసుకుంటున్నారు. నాణ్యమైన మందులు ప్రజలకు అందించడమే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఏడాది పొడవునా పర్యవేక్షణ:

జిల్లాలో 1200 మందుల దుకాణాలు ఉన్నాయి. జనవరి 2022 నుంచి డిసెంబర్ 2022 వరకు 863 దుకాణాలను పర్యవేక్షించారు. ఆ దుకాణాల్లో 135 శాంపిల్స్ సేకరించారు. వాటిలో నిబంధనలు పాటించని కారణంగా 6 దుకాణాలపై కేసులు నమోదు చేశారు. మందుల దుకాణంలో నిబంధనలకు అనుగుణంగా మందులు నిల్వ చేస్తున్నారా? లేదా? లైసెన్సు తీసుకున్నారా? లేదా? ఫ్రిజ్‌లో నిల్వ చేయాల్సిన మందులు అందులోనే నిల్వ చేస్తున్నది? లేనిది? లైసెన్సు రెన్యువల్ చేసింది లేనిదీ? ఫిజిషియన్ శాంపిల్స్ విక్రయిస్తున్నారా? అన్న విషయాలను పరిశీలంచేందుకు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఏడాది పొడవునా పర్యవేక్షిస్తున్నారు.

నిబంధనలు పాటించనివారిపై చర్యలు

నిబంధనలకు విరుద్ధంగా మందుల దుకాణాలు నిర్వహించే వారిపై ఔషధ నియంత్రణ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాలపరిమితి దాటిన మందులు విక్రయించడం, లైసెన్స్ లేకుండా మందుల దుకాణం నిర్వహించడం, రికార్డులు సరిగా లేకపోవడం, నాణ్యత లేని మందుల విక్రయం వంటి వాటిని గుర్తించి చర్యలు చేపడుతున్నారు.

మందుల కొనుగోలులో జాగ్రత్త అవసరం



మందుల దుకాణాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రజలు కూడా మందులు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. వైద్యుని సలహా మేరకు మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసే మందులకు కాలపరిమితి ఉన్నదీ..లేనిది చూసుకోవాలి. బిల్లు తప్పనసరిగా తీసుకోవాలి.

– కె. రజిత, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణశాఖ

పైడితల్లికి పుష్పాలంకరణ



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, పసిడి తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిని మహిళలు దర్శించి పసుపు, కుంకుమలు చెల్లించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అమ్మవారికి ఆలయ అధికారులు అరిసెలతో నివేదన చేశారు. కార్యకలాపాలను ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు పర్యవేక్షించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తరించారు.

అండర్-19 ఖోఖో పోటీలకు జిల్లా జట్లు సిద్ధం





అండర్-19 ఖోఖో పోటీలకు ఎంపికైన జిల్లా బాలికల జట్టు, బాలుర జట్టు

విజయనగరం: అంతర్ జిల్లాల అండర్-19 స్కూల్‌గేమ్స్ బాల, బాలికల ఖోఖో పోటీలకు జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. ఈ మేరకు మంగళవారం నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 160 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారిని జట్లుగా విభజించి పోటీలు నిర్వహించి, బాలుర జట్టులోకి 12 మందిని బాలికల జట్టులోకి 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జిల్లా వేదికగా జరగబోయే రాష్ట్రస్థాయి అండర్-19 ఖోఖో పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ కృష్ణ తెలిపారు. ఎంపిక పోటీలను విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు బొమ్మన రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.గోపాల్, సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

ప్రతిభకు ప్రశంసలు

- పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ అభినందన



ఎస్పీ ఎం.దీపిక చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న టూటౌన్ ఏఎస్సై వై.పైడితల్లి

విజయనగరం క్రైమ్: విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చి వివిధ నేరాలను ఛేదించడం, చోరీ కేసుల్లో నిందితులను అరెస్టు చేయడం, ఇతర రాష్ట్రాల్లో నిందితుల నుంచి చోరీ ఆస్తులను రికవరీ చేయడం, ట్రాఫిక్, కోర్టు విధులను సమర్థవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బంది ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ మేరకు ఎస్పీ ఎం.దీపిక మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వారిని అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు.

ప్రశంసపత్రాలు పొందిన వారిలో..

ప్రశంసపత్రాలు పొందిన వారిలో రూరల్ ఏఎస్సై ఎ.త్రినాథరావు, పీసీ షేక్ షఫీ, వన్‌టౌన్ ఎస్సై వి.అశోక్ కుమార్, హెచ్‌సీ ఎం.అచ్చిరాజు, పీసీ పి.శివకుమార్, టూటౌన్ ఏఎస్సై వై.పైడితల్లి, హెచ్‌సీ టీవీఆర్‌కేవీ ప్రసాద్, కానిస్టేబుల్ ఎం.వాసు, సీసీఎస్ హెచ్‌సీ ఇమ్రాన్ ఖాన్, హెచ్‌సీ డి.శంకరరావు, కానిస్టేబుల్ కె.సత్యం, సీహెచ్‌వీ పైడిరాజు, ట్రాఫిక్ హెచ్‌సీ అప్పలరాజు, వై.సురేష్ కుమార్, దిశ కానిస్టేబుల్ గోవింద్, చీపురుపల్లి సీఐ జి.సంజీవరావు, ఎస్సై ఎ.సన్యాసినాయుడు, కానిస్టేబుల్ ఎం.కుమారస్వామి, ఎం.భానోజీరావు, సీహెచ్.జగదీష్, గరివిడి ఎస్సై బి.మురళి, బుదరాయవలస కానిస్టేబుల్ పి.రమేష్, గుర్ల కానిస్టేబుల్ ఎం.మురళి, బొబ్బిలి హెచ్‌సీ ఎం.శ్రీనివాసరావు, బొండపల్లి కానిస్టేబుల్ బి.రవికుమార్, సంతకవిటి ఎస్సై ఆర్.జనార్దనరావు, కానిస్టేబుల్ వై.రామరాజు, భోగాపురం హెచ్‌సీ కె.శ్రీనివాసరావులు ఉన్నారు.

ప్రాసిక్యూషన్ కేసుల్లో నిందితులకు శిక్ష పడాలి

- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక





హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న కేసుల్లో ప్రాసిక్యూషన్‌లను ప్రాధాన్యతా క్రమంలో సంబంధిత సీఐలు, ఎస్సైలు గమనించాలని, నిందితులకు శిక్ష పడే విధంగా సాక్ష్యాలను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టి, నేరం నిరూపణయ్యే లా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో వార్షిక నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలను ఆయా పోలీస్‌స్టేషన్‌లలో పనిచేసే పోలీసు సిబ్బందికి దత్తతగా ఇవ్వాలని, ఆయా గ్రామాల్లో తరచూ గ్రామసందర్శన చేయాలని, గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని హితవు పలికారు. గ్రామస్థాయిలో సమాచారం సేకరించేందుకు ముఖ్యమైన వ్యక్తులు, అధికారుల ఫోన్ నంబర్లను సేకరించాలని, సమాచార వ్యవస్థను ప్రత్యేకంగా ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపైనా, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపైనా, గంజాయి వినియోగించే వారు, సారా తయారీ, రవాణా అమ్మకాలు సాగించే వారిపై కేసులు నమోదుచేయాలని స్పష్టం చేశారు.

పేలుడు సామగ్రితో ప్రమాదాలు జరగకూడదు

వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న పేలుడు, మందుగుండు సామగ్రి వల్ల ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సంబంధిత అధికారుల అనుమతితో వాటిని ప్రణాళిక ప్రకారం నిర్వీర్యం చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వివిధ కేసుల్లో న్యాయస్థానాలు జారీచేసే నాన్ బెయిలబుల్ వారంట్లను ఎగ్జిక్యూట్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, దిశ మహిళా పీఎస్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, ఎఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, న్యాయ సలహాదారు వై.పరశురాం, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, ప్రజా ప్రతినిధులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని బెలగాం ప్రాంతంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ జిల్లా నూతన కార్యాలయానికి మంగళవారం శంకుస్థాపన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, రాష్ట్ర చైర్మన్లు జమ్మాన ప్రసన్నకుమార్, డాక్టర్ రంగుముద్రి రమాదేవి, జిల్లా స్థాయి ప్రజా ప్రతినిధులు జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ రాష్ట్ర సభ్యురాలు సవరపు జయమణి, మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, జిల్లా పరిధిలో గల ప్రజాప్రతినిధులు ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలకు జిల్లా జట్టు పయనం



బాక్సింగ్ పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు మంగళవారం పయనమయ్యారు. ఈ నెల 31 వ తేదీ నుంచి ఫిబ్రవరి 2 వ తేదీ వరకు రాజమండ్రిలో అండర్ -14, అండర్-17, అండర్ -19 విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలు జరగనుండగా.. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు పోటీల్లో తలపడనున్నారు. మూడు రోజుల పాటు జరగబోయే పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచి పతకాలు సాధించాలని ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డోలా మన్మథకుమార్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో రౌతు భాస్కర్‌రావు, స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్వీ రమణమూర్తి, పి.కృష్ణ, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఎస్‌ఈ రాజు, ఎస్.రమణ, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, సీనియర్ బాక్సర్లు వి.సంతోష్‌కుమార్, కె.శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు రాజాం విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కోచ్

రాజాం సిటీ: జాతీయస్థాయి కరాటే పోటీలకు రాజాం విద్యార్థులు ఎంపికయ్యారని కోచ్ ఆర్.శివ మంగళవారం తెలిపారు. 65వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా అండర్-14, 17, 19 విభాగాలలో స్టేట్‌లెవెల్ కరాటే పోటీలు ఈ నెల 29, 30తేదీలలో ఒంగోలులో నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఎన్.సాయిలక్ష్మి అండర్-19 విభాగంలో ద్వితీయస్థానం, వి.సూర్యచంద్ర అండర్-14 విభాగంలో మూడవ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వారి ఎంపికపట్ల కరాటే కోచ్‌తోపాటు పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

ద్విచక్ర వాహనం బోల్తా: ముగ్గురికి గాయాలు

సీతంపేట: ద్విచక్రవాహనం బోల్తా పడిన సంఘటనలో కొత్తూరుకు చెందిన ముగ్గురు మైనర్లకు గాయాలయ్యాయి. సీతంపేట నుంచి కొత్తూరు బైక్‌పై వస్తుండగా మార్గమధ్యంలో ఐటీడీఏ వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో డ్రైవ్ చేస్తున్న సొండి అవినాష్‌తో పాటు వెనుక కూర్చున్న పి.రాజుమణి, శ్యాంప్రసాద్‌లు కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. వాహనాన్ని నడిపిన అవినాష్‌తో పాటు వాహనాన్ని నడపడానికి బైక్ ఇచ్చిన పెదనాన్న దేవులపల్లి అప్పన్నపై కూడా కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ సుందరరావు తెలిపారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

- జేసీ మయూర్ అశోక్



10వ తరగతి విద్యార్థి విద్యాసామర్థ్యాన్ని పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

రామభద్రపురం: విద్యారంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ భవిష్యత్తులో పిల్లలు ఉన్నత స్థాయిలో ఉండాలన్న లక్ష్యంతో అనేక నూతన సంస్కరణలు తీసుకువస్తోందని జేసీ మయూర్ అశోక్ అన్నారు. రామభద్రపురం ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 6,8,10 వ తరగతి పిల్లల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లలు రాసిన నోట్సు, వర్క్ బుక్‌లు చదివించారు. రోజూ సక్రమంగా తరగతులు జరుగుతున్నాయా లేదా?టీచర్లు విద్యాబోధన ఎలా చేస్తున్నారు? వారు చెప్పిన పాఠాలు అర్థమవుతున్నాయా అని 6వ తరగతి పిల్లలను ఆరా తీశారు. ట్యాబ్‌లు ఎలా పని చేస్తున్నాయి? మీరంతా వాడుతున్నారా? ట్యాబ్‌ల వినియోగం వల్ల ప్రయోజనం ఉందా? లేదా? అని 8వ తరగతి విద్యార్థులను అడిగి వారు వినియోగించిన తీరును పరిశీలించారు. వారంతా ట్యాబ్‌ల వల్ల చాలా ప్రయోజనం కలుగుతోందని జేసీకి తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్నారా లేదా? ఎన్ని చాప్టర్లు పూర్తయ్యాయి? పదో తరగతి తర్వాత ఏం చేయాలనుకుంటునారు? అని విద్యార్థులను ఆరా తీశారు. అలాగే మరుగుదొడ్ల నిర్వహణకు నిధులు వస్తున్నాయా? లేదా?అని హెచ్ఎం కామేశ్వరరావును అడగ్గా మరుగుదొడ్ల నిర్వహణ నిధులు రావడం లేదని ఆయన జేసీకి తెలిపారు.

విద్యాశాఖ కార్యదర్శి పర్యవేక్షిస్తారా?

రోజూ పాఠశాలలు పర్యవేక్షిస్తున్నారా? పర్యవేక్షిస్తూ ఫోటోలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారా లేదా? డిప్యూటీ డీఈవో తిరుపతినాయుడు, ఎంఈవో తిరుమలప్రసాద్‌ను అడగగా పర్యవేక్షణ ఫొటో అప్‌లోడ్ చేసేందుకు యాప్ లేదని వారు సమాధానమిచ్చారు. అనంతరం జేసీ మాట్లాడుతూ రెగ్యులర్‌గా పాఠశాలలు పర్యవేక్షించాలని, లోటు పాట్లు ఉంటే సరిద్దాలని డిప్యూటీ డీఈవో, ఎంఈవోలకు సూచించారు. మీరు చేయకుంటే విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి వచ్చి పర్యవేక్షిస్తారా? అని ప్రశ్నించారు. పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా టీచర్లంతా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీవో శేషశైలజ, డీటీ సుబ్బారావు, ఆర్ఐ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204

ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఓ వ్యక్తి మెడలోని గొలుసును సోమవారం రాత్రి లాక్కుని పరారైన ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు ఒకరోజు వ్యవధిలోనే అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన సీఐ బి.వెంకటరావు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తపేటకు చెందిన గుర్ల ఆనంద్, బొండపల్లికి చెందిన గేదెల సతీష్‌లు చెడు వ్యసనాలకు అలవాటు పడి ఈజీమనీ కోసం చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో స్థానిక బాలాజీ కూడలి నుంచి పెద్దచెరువు గట్టు వైపు వెళ్లే రహదారిలో ఉన్న సులభ్ కాంప్లెక్స్ వద్ద కొద్దిగా చీకటిగా ఉండడం చూసి, సులభ్ కాంప్లెక్స్ లోపలి నుంచి బయటకు వస్తున్న అంబటివలస గ్రామానికి చెందిన గణేష్ మెడలో ఉన్న వెండి గొలుసు లాక్కుని పరారయ్యారు. దీంతో బాధితుడు వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసిన పోలీసులు మంగళవారం రైల్వేస్టేషన్ రోడ్డులో నిందితులిద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించడంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఎస్సైలు భాస్కరరావు, రామ్‌గణేష్, హెచ్‌సీ అచ్చిరాజు, కానిస్టేబుల్ శివకుమార్‌లను సీఐ అభినందించారు.

కాపర్ వైరు చోరీ

భోగాపురం: మండలంలోని దల్లిపేట గ్రామంలో రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన వ్యవసాయ బోర్ల కోసం పొలాల వద్ద ఏర్పాటు చేసిన పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులో కాపర్ వైరును దొంగిలించారు. దీనిపై రైతులు కిలుము సోమినాయుడు, రాము నరసమ్మ, నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై పి.తవుడు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ, ధర్మదాయ శాఖ
శ్రీ వేంకటేశ్వర మరియు కోదండరామస్వామి వారి దేవస్థానములు
తోటపల్లి గ్రామం, గరుగుబిల్లి మండలం, పార్వతీపురం మన్యం జిల్లా



శ్రీ శుభకృత నామ సంవత్సరం మాఘశుద్ధ ఏకాదశి బుధవారం అనగా తే 01-02-2023 ది సా॥ 5.00 గం॥లకు
వార్షిక కళ్యాణం వైభోగం తిలకించండి.. తరించండి..
బుద్ధ మహాలక్ష్మినగేష్, కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ
జిల్లా కార్యాలయము, పార్వతీపురం మన్యం
అకౌంటెంట్ గ్రేడ్-III ఉద్యోగ ప్రకటన కొరకు గడువు పొడిగిస్తూ అనుబంధ ప్రకటన
టెండర్ నోటీసు నెం. Mktg / M2 / Gunny / 2022-23 తేది: 30.01.2023
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ జిల్లా కార్యాలయము, పార్వతీపురం మన్యం యందు పనిచేయుటకు ఆసక్తి మరియు అర్హత కలిగిన అభ్యర్థులు ఒక సంవత్సర కాల పరిమితిలో (అవసర నిమిత్తం గడువు పొడిగింపబడును) కూడిన అకౌంటెంట్ గ్రేడ్ - III పోస్టుకు రోస్టర్ విధానంతో కాంట్రాక్టు పద్ధతిపై ఏక మొత్తం పారితోషకం చెల్లించే విధంగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకొనవచ్చు అని నిర్ణయిస్తూ అనక్తి గల వ్యక్తుల నుండి తమ బయోడేటా, విద్యార్హత పత్రములు మరియు అనుభవ పత్రములు కాపీలతో దరఖాస్తులను 13.01.2023 ప్రకటన ద్వారా పొడిగించుబడినది. 13.01.2023వ తేదీ ప్రచురితం అయిన ప్రకటన గడువు పొడిగిస్తూ క్రింద తెలిపిన విధముగా అనుబంధ ప్రకటన జారీచేయుబడినది.

పోస్టు పేరు	అకౌంటెంట్ గ్రేడ్-III (కాంట్రాక్టు పద్ధతిపై)
ఖాళీల వివరములు	01 (ఒకటి)
ఉద్యోగ అర్హత వివరములు	1. CA / CMA Semi క్వాలిఫైడ్ i.e. Inter Passed
	2. Computer Skills
అనుభవం	సంబంధిత ఫీల్డ్‌లో రెండు (2) సంవత్సరములు
జీతం	నెలకు రూ.30,000/-లు మాత్రమే
వయస్సు	జనరల్ : 35 Years
	రిజర్వుడ్ : 40 Years

అనక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత పత్రములు మరియు అనుభవ పత్రములు కాపీలతో దరఖాస్తులను జిల్లా మేనేజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, సబ్ కలెక్టర్ ఆఫీసు కాంపౌండ్, పార్వతీపురం మన్యం వారి ఇ-మెయిల్ dcsm.pvpmanyam@gmail.com కి తేది 07-02-2023 సాయంత్రం గం. 5.00 గడువులోగ పంపవలెను మరియు 08-02-2023న ఉ. 10.00 గం.ల నుండి ఒరిజినల్ పత్రములు పరిశీలించబడును. గడువు మీరిన దరఖాస్తులను ఏ కారణం చూపకనే తిరస్కరించబడును. మరియు ఏ కారణం చూపకనే పై ఖాళీలను రద్దు చేయుటకు కూడా జిల్లా కలెక్టర్, పార్వతీపురం మన్యం మరియు వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ విజయవాడ వారికి అధికారం కలదు. తదుపరి వివరములకు ఫోన్: 7989626042, 9553337070కు సంప్రదించగలరు.
సం/- సంయుక్త కలెక్టరు మరియు
ఎక్స్ అఫీషియో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్, పార్వతీపురం మన్యం జిల్లా.

సాక్షి క్లాసిఫైడ్స్

Services
ఆయుర్వేదం
■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్రః 9603055647, 7995392747 [G-932]

WANTED
■ వైజాగ్ నందు పనిచేయుటకు Two Wheeler మెకానిక్స్ కావలెను. మంచి జీతం 18000 to 22000 వరకు ఇవ్వబడును. Cell: 9494837387 [S-1190847]
■ సత్యసాయి ఏజెన్సీ & కన్సల్టెన్సీ నందు, విశాఖపట్నం, విజయనగరంలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ Tally వచ్చి అనుభవం కలిగిన (M/F) మరియు శ్రీకాకుళం, విశాఖపట్నంలో కలెక్షన్ ఏజెంట్స్ 4వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ కల్గిన Male కావలెను. Cell: 9440127183 [S-1156923]
■ వైజాగ్ ఓల్డేజ్ హోమ్‌లో పనిచేయుటకు కుక్స్, నర్సులు, కేర్‌టేకర్స్, ఆయాలు, వార్డ్ బోయ్స్ కావలెను. జీతం + వసతి + భోజనం కల్పించబడును. ఫోన్: 92906 35086 [V. 3840]
■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోస్ట్ డ్రైవరు-3, హెల్పర్లు-5, జీతం: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1226251]
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233, 9052839891 [M-1190563]
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779865]
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం, జీ: 16K ఎజెంట్ కమీషన్ 3K. ఫోన్: 7569955551, 9848571888. [H-786829]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.